# స్పందన

**వి. రాజారామ మోహనరావు**



**ఇంకా** పూర్తిగా తెల్లారలేదు.

తలుపు చప్పుడికి మొగుడూ పెళ్ళాం యిద్దరికీ మెళుకు వొచ్చింది. ముందు లక్ష్మి లేచివెళ్ళి తలుపు తీసింది. రిక్షావాడికి డబ్బులిస్తున్న కాశమ్మగారు కనిపించింది. అప్పటికే ఆవిడ సామాను రిక్షాలోంచి దింపేసి వుండటం వల్ల వెనక్కొచ్చి ... "మీ కాశత్తయ్య వొచ్చింది లేవండి." అని భర్తని తట్టి లేపింది.

కళ్ళు నులముకుంటూ నెమ్మదిగా లేచాడు రామారావు గుమ్మందాకా వెళ్ళాలని పించేంత మెళుకువ రాలేదు. పక్కమీద అలాగే కూచుండి పోయాడు.

"ఏరా కులాసాయేనా... ఏమే అమ్మాయి బావున్నావా" అంటూ పలకరించింది గుమ్మంలోంచే కాశమ్మగారు.

"ఆ... యిప్పటిదాకా కులాసాయే" అన్నాడు రామారావు.

ఆవిడ గుమ్మంలో పెట్టిన సామాన్ను తీసి లోపలికి చేరేసింది లక్ష్మి. కాశమ్మగారూ యింకేం మాట్లాడకుండా లక్ష్మి వెనకాలే పెరటి వేపు నడిచింది.

మళ్ళీ నడుం వాల్చాడు రామారావు. తిరిగి నిద్ర పట్టలేదు, కళ్ళు మూసుకు పడుకున్నా, పాలవాడు రావటం, లక్ష్మి పాలు పోయించుకోటం అన్నీ తెలుస్తూనే వున్నాయి. మరికాస్సేపు దొర్లి కళ్ళు తెరిచాడు.

రామారావు అవస్థ చూసి "పోనీ లేచి ముఖం కడుక్కో కూడదూ" అంది లక్ష్మి.

రామారావేం సమాధానం చెప్పలేదు మరో పక్కకి తిరిగి పడుకున్నాడు పిల్లాడు యింకా నిద్రలేవలేదు. ఎంతో ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. చల్లటి ఉదయం గాలికి జుట్టు కొద్దిగా కదులుతోంది. నిద్రలోనే ఎందుకో నవ్వుతున్నాడు. ఆ నవ్వుకి ఎడం బుగ్గ కొంచం ఎక్కువగా కదులుతోంది

"పిచ్చి వెధవ" అనుకున్నాడు ఆప్యాయంగా పిల్లాడిమీద చెయ్యేసి

"వాడిమీద చేతులేసి లేపెయ్యకండి, కలతనిద్రలో లేస్తే నన్నిక పని చేసుకోనివ్వడు" అంది లక్ష్మి అటువేపు నుంచి వెడుతూ.

పిల్లాడిమీంచి చెయ్యి తీసేసి మళ్ళీ రెండోవేపుకి తిరిగాడు. అప్పుడే లోపల్నుంచి వచ్చిన కాశమ్మగారు చెంగుతో ముఖం తుడుచుకుంటూ గుమ్మందగ్గర కూలబడింది.

రామారావుకి అంతకు రెండు నిముషాలు ముందున్న ప్రశాంతత అంతా చెదిరి పోయింది. అసహనంగా యింక అక్కడ అలా పడుకోలేక నెమ్మదిగా లేచాడు.

'యీావిణ్ణి చూస్తేనే తనకి యింత చిరాగ్గావుంటే, ఎల్లకాలం యింట్లో వుంచుకోటం ఎలా! అనుకున్నాడు లోపలికెడుతూ.

రామారావు ముఖం కడుక్కొని ముందు గదిలోకి తిరిగి వచ్చేటప్పటికి లక్ష్మి కాఫీ కలిపి ముగ్గురికీ తీసుకొచ్చింది.

"ఈ మధ్య మీ నాన్న మన్నా ఉత్తరాలు రాశాడురా..." అంది కాశమ్మగారు కాఫీ తాగుతూ.

పది రోజుల క్రితం రాశాడు అక్కడ మీ అత్తారింట్లో నువ్వు నానా గొడవల్లో వున్నావని, యిక్కడికి వస్తున్నావనీ రాశాడు అది సరే వారం క్రితమే నువ్వు వస్తావని రాశాడు... యింత ఆలస్యమైందే..." అనడిగాడు రామారావు ఆ అడగటం చలా

పెడసరంగా అడిగాడు. ఆవిడ వారం ఆలశ్యంగా వచ్చిందన్న విచారం లేశమన్నా లేదు రామారావులో.

"వారం క్రితమే ప్రయాణమై కూచున్నాను. వెళ్ళటానికి డబ్బు యివాళ యిస్తాం రేపిస్తాం అని దాటేస్తూ వచ్చారు. అందుకాలశ్యమైంది. ఇప్పటికీనానాపోరూ పెడితే డబ్బు సర్దారు" అంది కాశమ్మగారు.

మనిషి ఎప్పుడూ పెద్ద రూపసికాదు కాకపోతే భర్త బతికున్న రోజుల్లో నుదుటి మీద బొట్టుతో, చేతుల్నిండా గాజుల్తో కాస్త నిండుగా కనిపించేది. భర్తపోయిన యీ యాడాదిలో కొంచెం చిక్కింది బుగ్గల మీదికి ఎముకలు పొడుచుకొచ్చాయి. అసలే పీలగా పొట్టిగా వుండే కాశమ్మగారు మరింత కుంచించుకు పోయినట్లు కనిపించింది రామారావుకి.

"ఏం వాళ్ళనంత పోరు పెడుతూ వారం రోజులు కూచోకపోతే మెళ్లో గొలుసుందిగా అమ్మేస్తారో, తాకట్టు పెట్టో రాలేకపోయావా" అన్నాడు రామారావు.

చేతికున్న యిత్తడి గాజుని గుండ్రంగా తిప్పుతూ కూచున్న కాశమ్మగారు గబుక్కుని తలెత్తి రామారావువేపు చూసింది. వో క్షణం అలాగే చూసి... "పోనీలేరా... యిప్పుడా గొలుసు గొడవెందుకు. నేనెలాగా రానే వచ్చాగా" అంది అక్కణ్నించి లేచి లోపలికెళ్తూ.

అల్లుంటి ఆఖరి గుర్తుగా ఆవిడ దగ్గర మిగిలింది ఆ గొలుసొక్కటే ఆ సంగతి రామారావుకీ తెలుసు.

"చూశావా యింకా బంగారం మీదా, డబ్బుమీద కాపీనం చావలేదు" అన్నాడు ఆవిడ లోపలికి వెళ్ళగానే భార్యతోటి.

"ఊరుకోండి. ఆవిడ యిప్పటికే బాగా దెబ్బతినుంది. మీ యీ మాటలు వింటే మరీ బాధపడుతుంది" అంది లక్ష్మి. భార్య అలా అని వెళ్ళాక కాస్సేపు గదిలో పచారు చేశాడు రామారావు. చికాకు తగ్గలేదు మరి కాస్సేపటికి తయారయి రోజుకన్నా పెందరాడే ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

* * *

పదిహేను రోజులు గడిచినా రామారావు మనస్థితిలో మార్పేం రాలేదు ఇంట్లో వున్నంతసేపూ యిబ్బందిగానే వుంటోంది. సాయంత్రం ఆఫీసు అయ్యాక యింటికి వెళ్లాలన్నా వుత్సాహంగా వుండటం లేదు తనది కాని పరిసరాల్లో వుంటున్నట్టు. ఏదో తెలియని యిరుకులో వుంటున్నట్టు వుంటోంది మేనత్తని చూసినప్పుడల్లా.

తను, భార్యా దగ్గరగా మాట్లాడుకుంటున్నా, ఒకళ్ళవేపు ఒకళ్లు చూసుకుంటున్నా, పిల్లాణ్ణి ముద్దులాడుతున్నా, మేనత్త నిలువు గుడ్లేసుకుని చూస్తున్నట్టే వుంటోంది రామారావుకి!

ఇదివరకూ కాశమ్మగారి మీద పెద్ద ఆపేక్ష లేదు రామారావుకి. అయినా యింత అసహనంగా వుండేది కాదు.

తండ్రి వుత్తరం రాయటం వల్లయితేనే, ఆవిడ భర్త పోవటం వల్లయితేనే తన పంచన వుండటానికి వచ్చిన ఆవిడమీద చిరాకు తగ్గించుకోవాలనుకున్నాడు రామారావు చాలాసార్లు. తీరా యింటికొచ్చేటప్పటికి కాశమ్మగార్ని చూసేటప్పటికి మళ్లీ మామూలుగానే తయారవుతోంది రామారావు పరిస్థితి

సరిగ్గా యిలాంటి గడ్డు సమయంలో, తల్లి వస్తోందన్న వార్త కొంచెం రిలీఫ్ నిచ్చింది రామారావుకి బెజవాడ పెళ్లికి వెళ్ళిన తల్లి ఆ మర్నాడే వస్తోందని వుత్తరం వచ్చిందగ్గర్నుంచీ ఆవిడ రాక కోసం ఎదురు చూస్తూనే గడిపాడు.

తల్లి వున్న నాలుగు రోజులు బాగానే గడిచాయి. వో రోజు ఆఫీసుకి శెలవు కూడా పెట్టాడు. ఇంట్లో దగ్గరుండి పెద్ద దిక్కుగా ఆవిడ అన్నివిషయాలూ చూస్తుంటే 'అమ్మా నాన్నా ఆ పల్లెటూరు వదిలి యిక్కడికి వచ్చేస్తే ఎంత బాగుణ్ను' అనుకున్నాడు. ఇదివరకు వొకటి రెండు సార్లు తండ్రితో కూడా అదే మాట చెప్పాడు రామారావు అయినా ఆ వూరు ఆ యిల్లు, ఆ పొలం వాటితో అనుబంధం వొంట్లో వోపికున్నంత కాలం తెంపుకు రాలేనని చెప్పేశాడు తండ్రి. తండ్రితోపాటే తల్లీ.

రైలెక్కించటానికి తీసికెడుతూ తల్లితో మళ్లీ అదేమాట అన్నాడు రామారావు.

"ఎలా కుదురుతుందిరా అక్కడ అంత బాదర బందీ పెట్టుకుని వొదిలి రాలేంగా ఎప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు వస్తూంటాం, పెద్ద దూరమేం కాదుగా అయినా నా కిప్పుడు యిదివరకటంతటి బెంగలేదు. మీ అత్తయ్య కూడా వుంది యిదివరకటిలా లక్ష్మి ఆ పసిపిల్లాడితో ఒక్కత్తే ఎలా తంటాలు పడుతుందో అన్న బెంగుండదు" అంది ఆవిడ రామారావుతో.

తల్లికి ఎలా చెప్పాలో అర్ధంకాలేదు రామారావుకి. 'అత్తయ్యంటే నాకూ ఇష్టం లేదు. ఆవిడ యింట్లో వుండటం అసలు యిష్టంలేదు' అని చెప్పాలనుకున్నాడు. కానీ అంత కుండ బద్దలు కొట్టినట్టు చెప్పలేక... "ఆవిడుంటే మాత్రం నువ్వున్నట్టు వుంటుందేమిటి..." అన్నాడు

"వుండదులే...అయినా కాశీ పరాయిదేం కాదుగా. ఆవిడంటే నీ కిష్టంలేదని తెలుసు. అయినా ఆవిణ్ణి యీ స్థితిలో దగ్గర పెట్టుకోటం మన ధర్మం కొంచెం చాదస్తం ఎక్కువ. మొండితనమూ ఎక్కువే యిప్పుడేకాదు చిన్నప్పట్నించీ మీ అత్తయ్య



అంతే. వయసు ముదిరేదాకా పెళ్లి కాక పోవటం. జరిగిన పెళ్లీ అయిష్టంగానే జరగటం అన్నీ కలిసి ఆవిణ్ని అలా తయారు చేశాయి. తనబాధబయటికిచెప్పుకునితేలికపడే మనిషీ కాదు, దాని దురదృష్టం చూడు. కడుపున వో నలుసైనా పడకుండా మొగుడు పోయాడు, మనిషి ఎలాంటిదేనా రక్త సంబంధం. పోదు. నువ్వే కొంచెం వోర్పుగా వుండాలి. ఏప్పుడు నువ్వు అంతగా తట్టుకో లేకపోతే అప్పుడే రాయి. నేనో, మీ నాన్న గారో వచ్చి తీసికెళ్ళిపోతాం. అంతేకానీ నువ్వూరికే మనసు పాడు చేసుకోకు'' అంది రామారావు మనసు గ్రహించినట్టు అవిడ.

'ఎంతయినా తల్లి మనసు. చెప్పకుండానే గ్రహించేసింది' అనుకున్నాడు రామారావు యింటికి తిరిగివస్తూ.

* * *

రోజులు గడుస్తూనే వున్నాయి ఎంత సర్దుకుపోవాలన్నా యింటి వాతావరణం యిరుగ్గానే వుంది రామారావుకి.

ఎవరితోటి కలివిడిగా మాట్లాడకుండా నిలువుగుడ్లేసుకుని చూసే యంత్రంలా వుండే మేనత్తని చూసినప్పుడల్లా యిప్పటి కేనా యీావిడ యీా బుద్ధులు మార్చు కుంటే ఎంత బావుణ్ణు అనుకునేవాడు రామారావు.

ఆవిడమీద అయిష్టంవల్ల ఆవిడ ఏం చేసినా, యింట్లో ఏ పని స్వతంత్రించి చేసినా తప్పుగానే తోచేది రామారావుకి.

తన బలహీనత తెలుసు. మరో నెల గడిచేటప్పటికి వో నిర్ణయానికి వచ్చేశాడు రామారావు. యిలా తనని తను మభ్య పెట్టుకోటం అనవసరం అనుకున్నాడు. అదే విషయం లక్ష్మితో చెప్పాడు. లక్ష్మి ఏం అనలేక ''మీ యిష్టం'' అంది.

కాశమ్మగార్ని తల్లీ వాళ్ళదగ్గరికి పంపిం చెయ్యాలని నిర్ణయం అయితే చేసుకున్నాడు కానీ ఆ విషయం ఆవిడకి ఎలా చెప్పాలో తెలియక కొంత ఆలశ్యం చేశాడు.

తల్లికి రాస్తే వచ్చి ఏదో వంకన తీసు కెళ్ళిపోతుంది. కానీ అలా చెయ్యాలనిపించ లేదు రామారావుకి. తన బలహీనతని ఆవిడ ఎడల తన అయిష్టతని వివరంగా చెప్పి, మేనత్తకి నచ్చచెప్పి మరీ వూరు పంపాలను కున్నాడు.

అదే ఎలా చెయ్యాలో నిర్ణయించుకోలేని

# స్పందన

స్థితిలో ఆఫీసు పని మీద వూరు పయాణం వచ్చింది రామారావుకి. ఆ హడావిడిలో యీా విషయం మరుగున పడింది.

* * *

రెండు రోజుల్లో తిరిగి రావాలనుకున్న రామారావుకి వెళ్లినపని చేసుకుని తిరిగి రావటానికి వారం పట్టింది.

గుమ్మంలోనే బిక్కముఖంతో కనిపిం చింది లక్ష్మి.

''ఏం...ఏమైంది అలా వున్నారు'' అన్నాడు కంగారుగా.

రామారావుని చూడగానే కళ్లల్లో నీళ్లు తిరిగాయి లక్ష్మికి. ఏడుపు ఆపుకుంటూ నెమ్మదిగా జరిగిందంతా చెప్పింది.

''మీరెళ్లినరోజు రాత్రే బాబుకి విపరీ తంగా ఎక్కిళ్లొచ్చాయి. కడుపు వుబ్బింది. కళ్లు తేలేస్తుంటే హాస్పిటల్ కి తీసి కెళ్లాం... ఆ రాత్రంతా మనసు మనసులో లేదు. బాబు దక్కుతాడనుకోలేదు. పాపం మీ అత్తయ్యే దగ్గరుండి ధైర్యం చెప్పింది. అర్ధరాత్రి వూరంతా వెతికి యింజక్షన్లు తేవటం, హాస్పిటల్ కి తిరగటం... బాబు దక్కాడంటే ఆవిడ పుణ్యమే అనుకోవాలి..

## కార్టూన్లు పంపేవారికి మనవి

కార్టూన్లతో పాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరుపెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం విజయవాడ 3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తరప్రత్యుత్త రాలకు తావు ఉండదు. కార్టూన్లు 'టపా'లో పోయినా, దారితప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్లు పంపేవారు కవరు మీద ఆ సంచికపేరు ఉదహ రించాలి. ఈ కార్టూన్లకికూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

సం.

మీరు నాకిచ్చిన డబ్బు అయిపోతే డబ్బూ ఆవిడే సర్దింది... యింకా బాబు హాస్పిటల్ లోనే వున్నాడు'' అంది లక్ష్మి.

కొడుకు కళ్లముందు మెదిలాడు రామా రావుకి. మనసంతా దిగులుగా తయా రయింది. బాబు యిప్పుడు బాగానే వున్నాడని లక్ష్మి చెప్పినా వెంటనే హాస్పిటల్ కి బైలు దేరాడు. హాస్పిటల్లో కుర్రాణ్ణి కులాసాగా చూసేవరకు మనసు కుదుట పడలేదు రామారావుకి.

మంచం మీద కుర్రాడితోపాటే. పక్కనే స్టూల్ మీద కూచుని కునికిపాట్లు పడు తున్న కాశమ్మగార్ని చూశాడు రామారావు. ఆవిడతోపాటే ఖాళీగా కనిపించిన ఆవిడ మెడనీ చూశాడు.

తిరిగి భార్యతో ఇంటికి వస్తుంటే నమ్మలేనిదేదో జరిగినట్టు... ''నిజంగా అత్తయ్య యింత సాయం చేసిందా...'' అన్నాడు.

''కళ్లముందు కనిపిస్తున్నా... మీకెందు కంత అపనమ్మకం...'' అనడిగింది లక్ష్మి.

లక్ష్మికి ఏం సమాధానం చెప్పలేదు రామారావు.

'సమయానికి ఆవిడ సాయం లేకపోతే లక్ష్మి ఏంచెయ్యాలో తోచక ఎంత కంగారు పడేదో, ఆ కంగారులో బాబుకి సరైన వైద్యం చేయించకపోతే ఎంత ప్రమాదం జరిగుండేదో అనుకున్నాడు రామారావు

పొట్టిగా, పీలగా, వికారంగా తన కళ్ళకి కనపడే మేనత్త గుర్తొచ్చింది. చిన్నతనం నుంచీ తనని మొరటుగా, దూరంగా చూసిందన్న ఆవిడ మీద తన అయిష్టం గుర్తొచ్చింది. మనిషి మంచిదో, చెడ్డదో ఆవిడ చేసిన సాయం తలుచుకునే టప్పటికి గుండె వేగంగా స్పందించింది రామారావుకి.

'మనిషి ప్రవర్తన, హృదయ స్పందన చుట్టూ ఏర్పడ్డ వాతావరణం మీద, పరిస్థితుల మీద ఎంత బలంగా ఆధారపడి వుంటుంది' అనుకున్నాడు.

''ఇప్పుడు కాకపోయినా మరో నెలకో రెండు నెలలకో ఆవిణ్ని చూస్తే తనకి తిరిగి చికాకు కలగచ్చు అలాగే ఆవిడకి తనని చూస్తే, తన బతుకులో లేని వాటిని ఎదురుగా చూస్తే అసహనంగా వుండచ్చు. అలాఅని దూరమవటమేనా దారి దగ్గరయ్యే ప్రయత్నం చెయ్యాలి'' అనుకున్నాడు.